క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనంతగిరి: మండలంలో శనివారం ఉదయం నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షంతో పాటు ఈదురుగాలులకు విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గ్రామాల్లో విద్యుత్ తీగలపై చెట్టుకొమ్మలు విరిగిపడుతుండడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్‌శాఖ సిబ్బంది కరెంట్ లైన్‌లు సరిచేయడం, పునరుద్ధరణ పనులు చేపట్టారు. దీంతో సాయంత్రం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

జీడిమామిడి మొక్కల పంపిణీ



జీడిమామిడి మొక్కలు అందజేస్తున్న ఎంపీటీసీ పద్మావతి, ఉపాధి సిబ్బంది

గంగవరం: ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యాన పంటల పెంపకంలో భాగంగా గిరిజన రైతులకు జీడిమామిడి మొక్కలు పంపిణీ చేస్తున్నట్టు ఉపాధిహామీ ఏపీవో ప్రకాశ్ తెలిపారు.ఈ మేరకు గంగవరం మండలం జగ్గంపాలెం, జియ్యంపాలెం, బయ్యనపల్లి, కొత్తాడ, నెల్లిపూడి, పిడతమామిడి, మొల్లేరు పంచాయతీల్లో 71 మంది రైతులకు 71 ఎకరాల విస్తీర్ణంలో నాటుకోవడానికి ఒడిశా నుంచి జీడిమామిడి అంటుమొక్కలు తీసుకొచ్చి రైతులకు అందజేశామన్నారు. ఆయా గ్రామ పంచాయతీ కేంద్రాల్లో స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదగా గిరిజన రైతులకు మొక్కలను శనివారం పంపిణీ చేయించినట్టు తెలిపారు.

వీవోఏ మృతికి సంతాపం



సుభాకర్ (ఫైల్)

అనంతగిరి: మండలంలోని ఎగువశోభ పంచాయతీ వీవోఏగా విధులు నిర్వహిస్తున్న పాంగి సుభాకర్ శనివారం మృతి చెందారు. గతకొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారని, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స అందించినా ఫలితం లేకుండాపోయిందని కుటుంబసభ్యులు తెలిపారు. శనివారం తీవ్ర అస్వస్థతకు గురై మృతిచెందినట్టు చెప్పారు. ఆయన మృతికి వెలుగు సిబ్బంది ప్రగాఢ సానుభూతి తెలిపారు. సర్పంచ్ సింహాద్రి సంతాపం తెలిపారు.

వారపు సంతకు వర్షం దెబ్బ



వర్షంతో బోసిపోయిన ముంచంగిపుట్టు వారపు సంత

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంతకు వర్షం దెబ్బ తగిలింది. ఏకధాటిగా కురుస్తున్న వర్షంతో మండలంలో జనజీవనం అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో వారపు సంతకు ఆశించిన స్థాయిలో కొనుగోలుదారులు రాలేదు. దొడిపుట్టు, వనభసింగి. నర్సిపుట్టు, పేటమాలిపుట్టు గ్రామాల నుంచి వచ్చిన కూరగాయాల రైతులు ఎటువంటి వ్యాపారం జరగకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పడుతున్న వర్షంతో చాలా మంది రైతులు అమ్మడానికి తీసుకు వచ్చిన కూరగాయాలను అమ్మకుండానే ఇంటి బాట పట్టారు. మైదాన ప్రాంతాల వ్యాపారులు వర్షంతో రాలేదు. దీంతో సంత పూర్తిగా బోసిపోయింది. వ్యాపారాలు సక్రమంగా జరగకపోవడంతో చార్జీ సొమ్ము కూడా రాలేదని గిరిజన రైతులు వాపోయారు. ఎప్పుడు లేని విధంగా సాయంత్రం 3 గంటలకే సంత ముగిసింది.

ఎండిన చెట్లను తొలగించండి



ప్రమాదకరంగా ఎండిన చెట్టు

అనంతగిరి: అరకు-విశాఖ ప్రధాన రహదారిలోని ఎండిచెట్లు ప్రమాదభరితంగా మారాయని, వెంటనే తొలగించాలని వాహనచోదకులు కోరుతున్నారు. గత మూడు రోజులు కురుస్తున్న వర్షంతో పాటుగా ఈదురుగాలులకు ఎండిచెట్ల వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తోందోనని ఆందోళన చెందుతున్నారు. ఓ మామిడి చెట్టు వెళ్తున్న లారీపై విరిగిపడడంతో డ్రైవర్, క్లీనర్ తీవ్రంగా గాయపడ్డారని, అధికారులు స్పందించి ఎండినచెట్లను తొలగించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

ఉప్పొంగిన గెడ్డలు, వాగులు

- పలు గ్రామాలకు తెగిన సంబంధాలు
- నిలిచిన విద్యుత్ సరఫరా
- పొలాల్లో చేరిన వర్షపునీరు



పొంగి ప్రవహిస్తున్న కించుమండ సంపంగి గెడ్డ



పింజరికొండ జలపాతం వద్ద ఎర్రనీటితో ఉధృతంగా ప్రవహిస్తున్న ఏలేరు వాగు



పరదానిపుట్టు కాజ్‌వే వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న సచివాలయ ఉద్యోగులు



పాడేరు మండలం బొక్కెళ్లు కాజ్‌వే మీదుగా పొంగి ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ



సీలేరులో రోడ్డుకు అడ్డంగా పడిన భారీ వృక్షం



మత్స్యగుండంలో వరదనీరు



గరుడాపల్లిలో పొలాల్లో చేరిన వరద నీరు



ఘాట్‌లోని డైమండ్ పార్క్ వద్ద కూలిన వృక్షం

సాక్షి,పాడేరు/పెదబయలు/డుంబ్రిగుడ (అరకులోయటౌన్)/అరకులోయ రూరల్/హుకుంపేట/ముంచంగిపుట్టు/జి.మాడుగుల/గూడెం కొత్తవీధి/సీలేరు/అడ్డతీగల/వై.రామవరం: అల్లూరి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి.మూడు రోజులుగా కుండపోతగా కురుస్తున్న వర్షాలు ముంచెత్తాయి.పంట భూములు చెరువులను తలపిస్తుండగా, ప్రధాన వాగులు, గెడ్డలు నదుల మాదిరిగా ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. పాడేరు డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లోను గెడ్డలు, వాగులలో వరద నీటి ప్రవాహం ప్రమాదకరంగా మారింది. జి.మాడుగుల, పాడేరు, పెదబయలు, హుకుంపేట మండలాల్లో విస్తరించిన మత్స్యగెడ్డలో వరదనీరు పోటెత్తడంతో సమీప వందలాది గ్రామాలకు రవాణ స్తంభించింది.పాడేరు మండలం బొక్కెళ్లు, పెదబయలు మండలంలోని పరదానిపుట్టు కాజ్‌వేల మీదుగా వరద నీరు ప్రవహించడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. ఈ ప్రాంతాల్లోని సచివాలయ ఉద్యోగులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. మత్స్యగుండం వరదనీటితో మునిగిపోవడంతో భక్తుల సందర్శనను నిలిపివేశారు. కొత్తపల్లి జలపాతంలో వరదనీరు ప్రమాదస్థాయికి చేరింది.అడ్డతీగల మండలంలోని ఎర్రనీటితో ఉరకలేస్తున్న పింజరికొండ జలపాతం, ఏలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది సీలేరు, పాడేరు ఘాట్‌రోడ్లలో చెట్లు కూలడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. అధికారులు స్పందించి పనులు పునరుద్ధరించారు. రహదారులు కోతకు గురయ్యాయి. గెడ్డలు దాటలేక, నిత్యావసర వస్తువులను తెచ్చుకునేందుకు గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రాలకు, వారపు సంతలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వర్షానికి చెట్లు, కొమ్మలు లైన్లపై పడడంతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. సెల్ సిగ్నల్ వ్యవస్థ, ఇంటర్నెట్ సేవలకు ఆటంకం కలిగింది. వరినాట్లు వేసిన పొలాలు నీట మునిగాయి. మరిన్ని రోజులు వర్షాలు కురిస్తే వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గిరిరైతులు వ్యవసాయ పనులకు వెళ్లలేకపోతున్నారు.



కొట్టుకుపోయిన పెదమాకవరం కాజ్‌వే



ఎటపాక మండలం తోటపల్లి వాగుకు పోటెత్తిన గోదావరి వరద



యర్రగెడ్డలో కాజ్‌వేపై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు



చాపగెడ్డ నుంచి వనగరాయి వరకు కోతకు గురైన మెటల్ రోడ్డు



చింతూరు వంతెన వద్ద శనివారం ఉధృతంగా ప్రవహిస్తున్న శబరినది



గద్యగుడ ప్రాంతంలో నీటమునిగిన వరినాట్లు



మత్స్యగెడ్డ వంతెనపై పొంగిప్రవహిస్తున్న వరద నీరు



సుత్తిగూడ కల్వర్టుపై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు



జాతీయ రహదారిపై ప్రమాదానికి గురైన లారీ



జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న వరదనీరు


ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



పెదబయలు: తీవ్ర తుపాను వల్ల గత మూడు రోజుల నుంచి వర్షాలు ఏకధాటిగా కురుస్తుండడంతో అందరూ అప్రమత్తంగా ఉండాలని, గెడ్డలు, వాగులు పొంగి ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, ఎవరూ దాటేందుకు సాహసం చేయవద్దని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ అరకు నియోజకవర్గంలో ఆరు మండలాల్లో శివారు గ్రామాలకు తప్పనిసరిగా గెడ్డలు దాటాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. భారీ వర్షాలకు నియోజకవర్గంలోని పెదబయలు, ముంచంగిపుట్టు, హుకుంపేట, డుంబ్రిగుడ, మండలాల్లో వందల గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయని, రాకపోకలు, సంబంధాలు తెగిపోయాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్న కారణంగా ఎవరూ దాటవద్దని, వరద ఉధృతి తగ్గే వరకు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అత్యవసర పరిస్థితులు వస్తే గ్రామ పంచాయతీ సచివాలయం సిబ్బందికి, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూంలకు ఫోన్ చేయాలన్నారు. అత్యవసర వైద్య సేవల కోసం ఆశ కార్యకర్తకు, స్థానిక పీహెచ్‌సీకి సమాచారం అందించాలన్నారు. జలదిగ్బంధంలో ఉన్న గ్రామస్తులను ఆదుకునేందుకు అన్ని పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు సేవలందించి, అండగా నిలువలన్నారు. మండల స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితి ఉంటే తనకు ఫోన్ చేయాలని ఎమ్మెల్యే కోరారు.

ప్రమాదస్థాయిలో జలాశయాలు



డుడుమ జలాశయం నుంచి విడుదల చేస్తున్న వరదనీరు



సూరంపాలెం ప్రాజెక్టు

- పెరుగుతున్న నీటి మట్టం
- అప్రమత్తమైన అధికారులు, సిబ్బంది

ముంచంగిపుట్టు: ఆంధ్ర-ఒడిశా రాష్ట్రాలు ఉమ్మడిగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి నీరు అందించే డుడుమ జలాశయం నీటి మట్టం ప్రమాదస్థాయికి చేరుకుంది. గత కొద్ది రోజులుగా సరిహద్దు గ్రామాల్లో కురుస్తున్న వర్షాలకు వరదనీరు భారీగా వచ్చి డుడుమ జలాశయంలోకి వచ్చి చేరడం నీటి నిల్వ పెరిగింది. డుడుమ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 2,590 అడుగులు కాగా శనివారం నాటికి 2,589.5అడుగులుగా నమోదైనట్టు అధికారులు తెలిపారు. దీంతో అప్రమత్తమైన జలాశయ సిబ్బంది ప్రాజెక్టు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి, డుడుమ జలాశయం 7వ నెంబర్ గేట్‌ను ఒక అడుగు ఎత్తి, వెయ్యి క్యూసెక్కుల నీటి దిగువనున్న బలిమెల జలాశయానికి విడుదల చేస్తున్నారు. డుడుమ జలాశయం నీటి మట్టం ప్రమాద స్థాయికి చేరుకోవడంతో సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. జోలాపుట్టు జలాశయ నీటి స్థాయి సైతం క్రమేపీ పెరుగుతూ వస్తుంది. జోలాపుట్టు జలాశయ పూర్తి స్థాయి నీటి మట్టం 2,750 అడుగులు కాగా శనివారం నాటికి 2,710.45 అడుగులుగా నమోదైనట్టు అధికారులు తెలిపారు. గతేడాది ఇదే సమయానికి 2,698.50 అడుగులు నీటి నిల్వ ఉండేది. గత ఏడాదితో పోలిస్తే 12 అడుగులు నీటి నిల్వ జోలాపుట్టులో అధికంగా ఉన్నట్టు పలువురు చెబుతునానరు. మాచ్‌ఖండ్‌లో రెండు జనరేటర్ల సహాయంతో 45 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని సిబ్బంది చెబుతున్నారు. నీటి నిల్వలు జలాశయంలో పెరుగుతూ ఉండడం మాచ్‌ఖండ్‌లో జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తికి నీటి సమస్య తీరుతుందని ప్రాజెక్టు సిబ్బంది ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మోతుగూడెం: గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో సీలేరు జలాశయాలు కలకలాడుతున్నాయి. అల్పపీడనం కారణంగా గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఆంధ్రా, ఒడిశా ఉమ్మడి జలాశయాలు అయిన జోలాపుట్టు , బలిమెలతో పాటు సీలేరు గుంటవాడ జలాశయం, డొంకరాయి జలాశయంలోకి భారీగా వరద నీరు చేరుతుంది. గత వేసవిలో కనిష్ట సాయికి చేరుకున్న నీటి నిలువలు ఇప్పుడు పెరగడంతో వచ్చే సంవత్సరం జల విద్యుత్ ఉత్పత్తికి ఎటువంటి ఇబ్బంది ఉండదని జెన్ కో అధికారులు చెబుతున్నారు. గత ఐదు రోజులుగా ఈ నాలుగు జలాశయాల్లో సుమారు 30 టీఎంసీ వరద నీరు చేరినట్టు అంచనా వేస్తున్నారు. ఇలాగే వరద ప్రవాహం కొనసాగితే వచ్చే పది రోజుల్లో పూర్తిస్థాయిలో సీలేరు జలాశయాలు నిండే అవకాశం ఉందని జెన్ కో అధికారులు తెలిపారు. జలాశయాలలో నీటి మట్టం అధికంగా ఉండడంతో నాలుగు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి కొనసాగిస్తున్నారు.

వర్షాలకు కూలిన ఇళ్లు

కొయ్యూరు: రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు శనివారం మండలంలోని రేవళ్ల గ్రామంలోని జన్ని వరాలమ్మ ఇల్లు కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో త్రుటిలో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. వర్షపునీటితో బాగా తడిసిన ఇంటి గోడలు బీటలు వారి పడిపోయినట్టు చెప్పారు. దీనిపై స్థానికులు తహసీల్దార్ రాజేశ్వరరావు, వీఆర్వో మంగకు సమాచారం ఇచ్చారు.పూర్తి వివరాలు అందజేయాలని తహశీల్దారు వీఆర్వోను ఆదేశించారు.



అరకులోయలో కూలిన ఇల్లు

చెట్టు కూలి.. ఇల్లు ధ్వంసం

అరకులోయ రూరల్: మండలంలో మాడగడ పంచాయతీ బోడుగూడ గ్రామానికి చెందిన కిల్లో రామకృష్ణ ఇంటిపై శనివారం సాయంత్రం భారీ చింత చెట్టు పడి ఇల్లు ధ్వంసమైంది. గత కొద్ది రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఇంటి పక్కనే ఉన్న చెట్టు కూలినట్టు స్థానికులు చెబుతున్నారు.. ఈ సమయంలో ఎవరూ లేకపోవడంతో త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. ప్రభుత్వం చొరవ చూపించి నష్టపరిహారం అందించాలని బాధితుడు రామకృష్ణ కోరుతున్నారు.



కొయ్యూరులో కూలిన ఇంటివద్ద బాధితులు

క్షయ నిర్ధారణ పరీక్షలు విజయవంతం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా దగ్గుతో బాధపడే రోగులను గుర్తించి, క్షయ నిర్ధారణ పరీక్షలను నిర్వహించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. తన క్యాంపు కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు.

ఆయన మాట్లాడుతూ క్షయ రహిత జిల్లా లక్ష్యంగా విధులు నిర్వహించాలన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి, అనారోగ్యంతో బాధపడేవారిని గుర్తించి అన్ని వైద్య పరీక్షలు చేయాలని ఆదేశించారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ల్యాబ్ టెక్నీషియన్‌లంతా క్షయ నిర్ధారణ పరీక్షలు జరపాలని, వ్యాధి నిర్ధారణ జరిగితే తక్షణమే ఆయా రోగులకు వైద్యసేవలు అందించాలన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హేమలతాదేవి, జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, పలు పీహెచ్‌సీల వైద్యులు పాల్గొన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

రాజవొమ్మంగి: స్థానిక షిర్డీ సాయిబాబా మందిరంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పల్లకిసేవ వైభవంగా జరిగింది. ప్రత్యేక భజనలు, కోలాట నృత్యాలు చేస్తూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రసాద వితరణ జరిగింది. గురుపౌర్ణమి సందర్భంగా సాయిబాబాకు తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, క్షీరాభిషేకం, పుష్పాభిషేకం తదితర అభిషేకాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహస్తున్నామని, అధిక సంఖ్యలో భక్తులు రావాలని కోరారు.

అన్నదాతకు అండగా...



గిరిజనుడి పొలంలో టిప్పర్‌తో దున్నుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

28న మోదమ్మ శాకంబరి అలంకరణ ఉత్సవం



ఆలయ కమిటీ ప్రతినిధులతో సమావేశమైన పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మ తల్లికి ఈనెల 28వతేదీన శాకంబరి అలంకరణ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు తెలిపారు. ఆయన శనివారం ఆలయ కమిటీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఆలయ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా జరుగుతున్న మోదకొండమ్మతల్లి శాకాంబారి అలంకరణ ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. అదే రోజు మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న సమరాధన కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఏజెన్సీతో పాటు మైదాన ప్రాంత భక్తులంతా భారీగానే తరలివచ్చి ఉత్సవాల్లో పాల్గొవాలని కోరారు. పాడేరు పట్టణంలోని అన్ని వర్గాల భక్తులు, ఆలయ కమిటీకి అన్ని విధాల సహకరించాలని ఆయన కోరారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు, ఇతర ప్రతినిధులు ఉప్పల వెంకటరత్నం, డిపి.రాంబాబు, సల్లా రామకృష్ణ, ముకుందు, శివరాత్రి శ్రీనివాసరావు, తమర్భ ప్రసాద్‌నాయుడు, శ్రీనాధు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులకు ఇంటి పైకప్పు ధ్వంసం



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు

ముంచంగిపుట్టు: మండలంలోని జర్జుల పంచాయతీ పెద్దతమ్మెంగుల గ్రామంలో శనివారం ఉదయం వర్షంతో కూడిన ఈదురుగాలులకు గజ్జంగి నీనిగురు అనే గిరిజనుడి ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయి ధ్వంసమయ్యాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పంది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు నీనిగురు కోరారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు పెద్దతమ్మెంగుల వెళ్లి పాడైన ఇంటిని పరిశీలించారు. బాధిత కుటుంబతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాయకులు త్రినాథ్, రాంబాబు, ముకుందు, సుబ్బరావు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు సమన్వయంతో పనిచేయండి



మాట్లాడుతున్న డీఎల్‌పీవో కుమార్

చింతపల్లిరూరల్: గ్రామాల్లో సీజనల్ వ్యాధుల నియంత్రణకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని డీఎల్‌పీవో పి.ఎస్.కుమార్ అన్నారు. మండలంలో చౌడుపల్లి పంచాయతీ సచివాలయం-2 పరిధిలో శనివారం సీజనల్ వ్యాధులపై ఆవహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రబలే వ్యాధులపై గిరిజనులకు గ్రామస్థాయి సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. డయేరియా, మలేరియా, డేంగ్యూ , టైఫాయిడ్ తదితర వ్యాధులను అరికట్టేందుకు పంచాయతీ రాజ్, వైద్య ఆరోగ్యశాఖ, మలేరియా సిబ్బంది సమన్వయంతో పనిచేసి వ్యాధులు నియంత్రణకు కృషి చేయాలన్నారు. ఎంపీడీవో వీరసాయిబాబు, ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్, సర్పంచ్ లలిత, కార్యదర్శి పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.